క్లుప్తంగా

ఎంఈఓగా రాజేంద్ర ప్రసాద్



ఆదోని సెంట్రల్: మండల విద్యాధికారి–1గా జి.రాజేంద్ర ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన బి. శివరాములు గత నెల 31న పదవీ విరమణ పొందారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యాభివృద్ధికి ఇబ్బందులు కలగ కూడదని ప్రభుత్వం ఆస్పరి ఎంఈఓ జి.రాజేంద్ర ప్రసాద్‌కు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ఇటుకలను పరిశీలిస్తున్న సిద్దలింగమూర్తి

ఆదోని సెంట్రల్: జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పిడి.సిద్దలింగమూర్తి తెలిపారు. సోమవారం కాలనీలోని ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాలకు వినియోగించే ఇటుకల నాణ్యతను, ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలపై హౌసింగ్ డీఈ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో 5,101 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 1,402 టాప్ దశ పూర్తికాగా 690 టాప్ లెవల్‌లో, 142 లింటల్ దశ, 2,051 బేస్ మట్టంలో పనులు జరుగుతున్నాయని చెప్పారు.

ఈరన్న సన్నిధిలో భక్తుల సందడి



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుందలో ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. కాగా ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. తర్వాత భక్తులను దర్శనానికి వదిలారు. పలువురు మొక్కుబడులను తీర్చుకునేందుకు దేవాలయ ఆవరణంలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

పాఠశాలలు తనిఖీ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఎస్ డబ్ల్యూ ప్రాథమిక పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లను సోమవారం ఎంఈఓ నాగేశ్వప్ప తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయుల పనితీరు, హాజరు శాతం చెక్ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని. వంట ఏజెన్సీలకు ఆదేశించారు. అనంతరం తరగతి గదిలో ఉపాధ్యాయుల విద్యాబోధనను, విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే మోడల్ స్కూల్ హాస్టల్‌లో వసతులపై ఆరా తీశారు.

కరువు సహాయక చర్యలు చేపట్టండి

కౌతాళం: మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కోరారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారును కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సరైన వర్షాలు లేక రైతులు నష్టపోయారన్నారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం కౌతాళంను కరువు మండలంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఈరన్న పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం



గాయపడిన చిన్నారులు

కౌతాళం: పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ముగ్గురు చిన్నారులపై దాడి చేసింది. మండల పరిధిలోని హాల్వి గ్రామంలో సాయంత్రం ఆరు గంటల సమయంలో పిల్లలు ఆడుకుంటుండగా ఈ ఘటన జరిగింది. ఇందులో రెండు సంవత్సరాల చిన్నారి సంగీత, ఏడేళ్ల బాలుడు అనుక్, తొమ్మిదేళ్ల బాలుడు శరణబసవపై తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కల వారు గమనించి కుక్కను కర్రలతో వెంబడించారు. గాయపడిన చిన్నారులను వారి తల్లిదండ్రులు కౌతాళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. సంగీతకు మెరుగైన వైద్యం కోసం వైద్యులు ఆదోని ఆసుపత్రికి రెఫర్ చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కౌతాళం: మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన త్రైంబకేశ్వర స్వామి ఆలయాన్ని ఈనెల 22న ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వివిధ మఠం పీఠాధిపతులు పాల్గొన్నారు.

- ఆదోని 5వ వార్డులో అభివృద్ధి పరుగులు
- అర్హులకు సంక్షేమ పథకాలు
- తీరిన రహదారి, డ్రైనేజీ సమస్య
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

సంక్షేమం.. అభివృద్ధి



రాంజల పార్కు రోడ్డులో విశాలంగా తారు రోడ్డు



ఎన్‌జీవోస్ కాలనీలో కొత్త పార్కుకు ప్రహరీ నిర్మించిన దృశ్యం

ఆదోనిటౌన్: ఐదేళ్ల క్రితం వరకు పట్టణంలోని రోడ్లు అధ్వానంగా ఉండేవి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇక డ్రైనేజీలు లేక రోడ్లపై మురుగు ప్రవహించేది. ఉన్న చోట్ల నిర్వహణ లోపించడంతో పూడిపోయి శిథిలమైపోయాయి. జనం అవస్థలు పడుతున్నా నాటి పాలకులకు పట్టలేదు. ఇక సంక్షేమ పథకాలు తమకు కావలసిన వారికి అందజేసి చేతులు దులుపుకున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. వీధుల్లోని రోడ్లను సీసీ రోడ్లుగా మార్చి, మురుగు కాల్వల నిర్మాణాలు పూర్తి చేసింది. ఇక పట్టణంలోని ప్రధాన రోడ్లకు ఉండే లింక్ రోడ్లను నూతన తారు రోడ్లుగా మార్చింది. 5వ వార్డు ఎన్‌జీవోస్ కాలనీలో ప్రతి వీధిలో తారు రోడ్లే దర్శనమిస్తున్నాయి. విశాలంగా నిర్మించడంతో ప్రజలకు రహదారి ఇక్కట్లు తొలగాయి. ఎల్‌ఐజీ, ఎంఐజీలో నేడు రోడ్లు మార్చడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి. ఇక ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేయడంతో లబ్ధిదారులు, కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనుల వివరాలు..

- 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలతో రాంజల పార్కు రోడ్డు (జిమ్ రోడ్డు) ఏర్పాటు చేశారు.
- ఎల్‌ఐజీ, ఎంఐజీ కాలనీల్లో 14వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.1.60 కోట్లతో ఐదు వీధుల్లో బీటీ రోడ్లతో పాటు లింకు రోడ్లను నిర్మించారు.
- 14వ ఆర్థిక సంఘం నిధుల రూ.25 లక్షలతో ఎంఐజీలోని పార్కు రోడ్డు ఏర్పాటు చేశారు.
- ఎంఐజీ వీధిలో కొత్త పార్కుకు సంబంధించి 14వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.42 లక్షలతో ప్రహరీ నిర్మించారు.
- పంప్‌హౌస్‌కు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలతో కాంపౌండ్ ఏర్పాటు చేశారు.
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 లక్షలతో ఎల్‌ఐజీ, ఎంఐజీలో మురుగు కాలువలను ఏర్పాటు చేశారు.
- గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో మురుగు కాలువలను నిర్మించారు.
- ఎంఐజీలో గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.20 లక్షలతో రోడ్లు వేశారు.
- ఆదిత్య నర్సింగ్ హోం ఏరియాలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో డ్రైనేజీలు ఏర్పాటు చేశారు.
- సాయి సూపర్ మార్కెట్ ఏరియాలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.30 లక్షలతో మూడు బీటీ రోడ్లు, లింకు రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.

సంక్షేమ పథకాల వివరాలు..

జనాభా : 6వేలు, పురుషులు : 3,500
మహిళలు : 2,500

- 540 పింఛన్‌దారులకు ప్రతి నెల మంజూరయ్యే సొమ్ము రూ.13.08 లక్షలు
- వైఎస్సార్ చేయూత కింద 271 మందికి రూ.50,81,250 లబ్ధి
- వాహనమిత్ర కింద 24 మందికి రూ.24 లక్షలు మంజూరు
- జగనన్నతోడు కింద 72 మందికి రూ.72 లక్షలు విడుదల
- కాపునేస్తం కింద 8 మందికి రూ.1.20 లక్షల లబ్ధి
- ఈబీసీ నేస్తం కింద 14 మందికి రూ.2.10 లక్షలు మంజూరు
- అమ్మ ఒడి పథకం కింద 320 మందికి రూ.48 లక్షలు జమ
- విద్యాదీవెన పథకం కింద 132 మందికి రూ.8,72,705 జమ
- వసతిదీవెన కింద 132 మందికి రూ.26.40 లక్షలు మంజూరు
- జగనన్నచేదోడు పథకం కింద 15 మందికి రూ.1.50 లక్షలు లబ్ధి చేకూరింది.



పంప్‌హౌస్‌కు రక్షణగా నిర్మించిన ప్రహరీ



ఎంఐజీలో కొత్తగా వేసిన బీటీ రోడ్డు



ఎల్‌ఐజీలో ఆటోస్టాండ్ వద్ద వేసిన రోడ్డు

ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేశాం



ఎన్నికల ముందు వార్డు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో సందుల్లో మొదలుకొని పెద్ద పెద్ద వీధుల్లోనూ తారు రోడ్లు, కల్వర్టులు, మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాం. ఇంత అభివృద్ధి మునుపెన్నడూ జరగలేదు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– కె.రఘునాథ్‌రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్

ఇంతటి అభివృద్ధి ఎన్నడూ జరగలేదు



వార్డులో ఏ వీధిలో చూసినా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టారు. గతంలో మా ఇంటి ముందు రోడ్డు లేక ఇబ్బందులు పడ్డాం. పేరుకే పెద్ద కాలనీ అయినా అభివృద్ధి లేక వెలవెలబోయేది. జగనన్న పాలన మినహా కాలనీలో అభివృద్ధి పనులు జరగలేదు. రోడ్లు, కాలువలు, పార్కులను రూపుదిద్దారు. ఇంతటి అభివృద్ధి ఎన్నడూ జరగలేదు.

– ప్రేమ్‌కుమార్, అరుంజ్యోతినగర్

ఐదేళ్ల క్రితం రోడ్లు, కాలువలు లేవు



ఐదేళ్ల క్రితం కాలనీలో బురదలోనే రాకపోకలు సాగించేవాళ్లం. నడిచే సమయంలో ఎన్నోసార్లు జారి బురదలో పడ్డాం. బురదలో రాళ్లను అక్కడక్కడ ఏర్పాటు చేసుకుని వాటిపై రాకపోకలు సాగించాం. నేడు సీసీ రోడ్లు,కాలువలు వేయడం వల్ల ఆ కష్టాలన్నీ తొలగిపోయాయి. సంతోషంగా ఉంది. ఇంత వరకు ఈ స్థాయి అభివృద్ధి ఏ కాలనీలో జరగలేదు. జగనన్న ప్రభుత్వం పేదల కాలనీలను తీర్చి దిద్దింది.

– ఉస్మాన్‌బాషా, 5వ వార్డు

ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొన్న వందగల్లు జట్టు

కోసిగి: విశాఖ పట్నం జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆడుదాం –ఆంధ్ర ఖోఖో పోటీల్లో కోసిగి మండలం వందగల్లు గ్రామ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. సోమవారం కృష్ణా జిల్లా, కర్నూలు జిల్లా (వందగల్లు సచివాలయం) జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో కృష్ణా జిల్లా జట్టు గెలుపొందింది. అయితే, రాష్ట్ర స్థాయిలో వందగల్లు జట్టు క్రీడాకారుడు నేలకోసిగి రమేష్ ప్రతిభ కనబర్చి ఉత్తమ ఆటగాడిగా నిలిచాడు. క్రీడాకారుడిని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నష్టపరిహారం చెల్లించాలి

ఆదోనిరూరల్: గతేడాది దెబ్బతిన్న పంటలకు తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు కోరారు. సోమవారం ఆదోని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2023లో ఆదోని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు పంట నష్టపరిహారంగానీ, బీమా గానీ రైతులకు అందజేయలేదన్నారు. తక్షణమే పంటలు నష్టపోయిన రైతులకు మిర్చికి రూ.50 వేలు, పత్తికి రూ.30 వేలు పరిహారం చెల్లించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, రైతుసంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, జిల్లా కమిటీ సభ్యుడు బాషా, సీఐటీయూ మండల కార్యదర్శి బి.వీరారెడ్డి, కేవీపీఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి

ఆదోనిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్‌కు ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సోమవారం సీపీఐ పార్టీ సంపూర్ణ మద్దతు నిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పట్టణ కార్యదర్శి ఎస్.సుదర్శన్‌తో కలిసి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని , ప్రజలపై మోపిన భారాలను తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నరసప్ప, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి విరాళాలు



దాతలకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి సోమవారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. కడివేళ్ల (ఎమ్మిగనూరు)వాస్తవ్యులు పుచ్చకాయల విరుపాక్షిరెడ్డి, స్రవంతి దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ.50,116, అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన వై. నర్సిహులు కుటుంబ సభ్యులు రూ.50,100 అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు వెంకటేష్, ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్లు లక్ష్మీరెడ్డి, పీరారెడ్డి, సిబ్బంది మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయస్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో మార్కండేశ్వరుడు, హోమంలో పాల్గొన్న భక్తులు, రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని చిన్నమార్కెట్‌లో వెలిసిన శ్రీ మార్కండేయస్వామి ఆలయంలో స్వామివారి జయంతి వేడుకలను పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి తుంగభద్ర నది నుంచి తెచ్చిన జలాలతో అభిషేకం అనంతరం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకంతో పాలు ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ రకాల హోమాలు జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని రథంపై అధిష్టింపజేసి భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల మధ్య రథోత్సవం చేపట్టారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, రామకృష్ణ, సభ్యులు రంగస్వామి, నాగరాజు, హంపయ్య పాల్గొన్నారు. స్వామి వారిని ఎమ్మెల్యే తనయుడు జయమనోజ్ రెడ్డి దర్శించుకున్నారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో శ్రీభక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం వేకువ జామున నుంచి ఆలయ అర్చకులు వీరేష్ స్వామి, ఆలయ ధర్మకర్త వై.ఆంజనేయులు ఆధ్వర్యంలో భక్తులు స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, వెండి కవచ అలంకరణ, ఆకు పూజ, ఫలపుష్పాలంకరణలు గావించి మహామంగళ హారుతులు ఇచ్చి విశేష పూజలు చేశారు. అలాగే గణపతి పూజ, నవగ్రహ పూజలు చేశారు. స్వామి వారికి నారికేలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.కార్యక్రమంలో ఆలయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

ఆదోనిఅర్బన్: పట్టణంలోనీ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో వెలిసిన శ్రీ అశ్వర్థ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముందుగా అశ్వర్థ లక్ష్మీనారాయణస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోపూ, గంగ, గణపతి పూజలు చేశారు. సాయంత్రం గణపతి హోమం, దీక్షా హోమం, జలాధివానం, మహామంగళహారతి, రుతి గ్వర్వరణం పూజలు జరిపించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై దృష్టి సారించండి



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు

పెద్దకడబూరు: రానున్న ఎన్నికలకు గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దారు సురేష్‌బాబు ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్‌లను ఆయన పరిశీలించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీరు, బాత్‌రూమ్స్ తదితరవి ప్రతి కేంద్రంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు వీరేంద్రగౌడ్, వీఆర్ఓ నరసన్న, సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

కోసిగి: మండల కేంద్రం కోసిగి నాడుగేని వీధిలో ఉంటున్న వైఎస్సార్ సీపీ మండల నాయకుడు నాడుగేని నాగరాజును ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి సోమవారం పరామర్శించారు. నాగరాజు ఇటీవల కర్నూలులో కుడికాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. డిశ్చార్జ్ అయి ఊరికి రావడంతో గ్రామ ఎంపీపీ ఈరన్న, నాయకుడు బుళ్లి నరసింహులు తదితరులతో కలిసి మండల ఇన్‌చార్జ్ పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సైన్స్‌పై అవగాహన పెంచాలి

కోసిగి: మూఢనమ్మకాలను పారద్రోలేందుకు సామాన్య ప్రజలకు సైన్స్‌పై అవగాహన పెంచాలని హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, సైన్ ఉపాధ్యాయుడు గురుస్వామి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య విద్యార్థులకు చెప్పారు. సోమవారం మండల కేంద్రం కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో చార్లెస్ డార్విన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డార్విన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన జీవన పరిమాణ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సిద్ధాంతం ప్రజల్లో దాగి ఉన్న మూఢ నమ్మకాలను తరిమేందుకు దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

మంత్రాలయం : రాబోవు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. సోమవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో సీఐ ఎరిసావలి, మాధవరం ఎస్‌ఐ కిరణ్ బాబులతో కలిసి ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా స్వేచ్ఛయుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఘర్షణలు పడి జీవితాలు నాశనం చేసుకోకూడదన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసులు దృష్టికి తీసుకురావాలని వాటిని సానుకూలంగా పరిష్కరిస్తామన్నారు. పాతకక్షలు మనసులో పెట్టుకుని ఘర్షణలకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



రచ్చుమర్రి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించండి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న పరిపాలనాధికారి శేషయ్య

ఆదోనిరూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలకు గడువులోపు పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి శేషయ్య సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల్లోని గ్రామాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శ్రీనివాసులు, గృహనిర్మాణశాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, ఆర్టీఓ నాగేంద్ర, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఉప తహసీల్దార్ కౌసర్‌బాను, పౌర సరఫరాలశాఖ ఉప తహసీల్దార్ వలీబాషా పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని....

- మండలంలోని కపటి గ్రామానికి చెందిన సర్పంచ్ 2021లో ఎంపికై నప్పటి నుంచి గ్రామాభివృద్ధి చేయకపోగా గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తూ గ్రామాభివృద్ధికి సహకరించడం లేదని గ్రామస్తులు రాజు, సాయిరాజ్, ఈరన్న, కడబూరయ్య, వెంకటస్వామి, దేవదాస్ వినతి పత్రం అందజేశారు. బీసీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల, సీసీ రోడ్లు, డ్రెయినేజీ నాణ్యత లేకుండా బిల్లులను తన ఖాతాల్లోకి వేసుకున్నాడని, విచారణ చేయించాలని కోరారు.
- కోసిగి మండలకేంద్రానికి చెందిన నిజాముద్దీన్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన బియ్యం కార్డులో ఇంటి నంబర్ నమోదు కాలేదు. నమోదు చేయాలని అర్జీ సమర్పించాడు.
- పెద్దకడబూరు మండలం హెచ్.మురవాణి గ్రామానికి చెందిన ఉరుకుంద సర్వే నంబర్ 450ఏలో 0.95 సెంట్లు, సర్వేనం. 450సీలో 4.80 ఎకరాల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించిందని, ఆ భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదైందని, సదరు భూమి కోర్టు పరిధిలో విచారణలో ఉందని, తీర్పు వచ్చేవరకు డిస్ప్యూట్‌లో నమోదు చేయాలని అర్జీ అందజేశారు.
- తనకు చర్మకార పింఛన్ మంజూరు చేయాలని కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన హరిజన యేసయ్య అర్జీ సమర్పించారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని రణమండల కొండలో నిర్వహిస్తున్న నాటు సారా బట్టీలను వన్‌టౌన్, రూరల్ పోలీసులు సోమవారం దాడులు చేసి ధ్వంసం చేశారు. సీఐలు తేజమూర్తి, నిరంజన్‌రెడ్డిలతో పాటు ఎస్‌ఐలు, సిబ్బంది స్థావరాలపై దాడులు చేశారు. వెయ్యి లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని నాగలాపురం గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ ఎర్రిస్వామి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన పరమేష్, వీరేష్‌తో పాటు మరో ఐదుగురు గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.18,240 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

పెండింగ్ పట్టాలు ఇవ్వండి

మంత్రాలయం: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పట్టాలను లబ్ధిదారులకు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి జయరాజు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్ మూర్తికి ఆ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చాల మంది లబ్ధిదారులు వలస వెళ్లారన్నారు. స్థానిక సచివాలయాల్లో ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, వలస వెళ్లిన కుటుంబాలను గుర్తించి వారి పట్టాలను కూడా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరుపేదలకు కేటాయించిన స్థలాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగన్న, దేవరం ప్రాణేష్, అంజి ఉన్నారు.

రూ.35 లక్షలతో సీసీ రోడ్డు పనులు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న నాయికులు

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.35 లక్షలతో డ్రెయినేజీ, సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాలతో సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి.బెళగల్ గ్రామం మెయిన్ రోడ్డు నుంచి గ్రామంలో పాఠశాల వరకు డ్రెయినేజీ, సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, బుళ్లి నరసింహులు, దొడ్డి నరసన్న, వీరన్న గౌడ, ఉరుకుందప్ప, రవిగౌడ్, సూర్యకాంత్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఈడిగ భీమయ్య, డీలర్ ఈరన్న, వడ్రి నరసప్ప, బజారి ఉన్నారు.

నివాళి

ఆదోనిరూరల్: మండలంలోని మాంత్రికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గిడ్డయ్య తండ్రి బంగారప్ప సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.